క్లుప్తంగా

సాయిబాబాకు విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భజనలు, రాత్రి బాబాకు పల్లకిసేవ, శేజ్ హారతి నిర్వహించారు.

బీసీజీ వ్యాక్సినేషన్



కొత్తవంగల్లులో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లులో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి కావ్య మాట్లాడుతూ క్షయ నియంత్రణకు 60 ఏళ్ల పైబడిన వారికి వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు కూడా వ్యాక్సిన్ వేయించుకోవచ్చని చెప్పారు. వ్యాక్సిన్ వల్ల క్షయ రాకుండా ఉండడం తోపాటు బీపీ, షుగర్‌లు నియంత్రణలో ఉంటాయని తెలిపారు. వైద్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుని అర్హులకే వ్యాక్సిన్ వేస్తున్నందున నిశ్చింతంగా వేయించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్, ఏఎన్‌ఎంలు శాంతకుమారి, కీర్తి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ మృతి

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లా విభిన్న ప్రతిభావంతులు–వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ అక్బర్‌అలీ గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన వనంతోపు సెంటర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో సాయంత్రం విధుల్లో ఉండగా గుండెపోటుకు గురయ్యారు. ఆయన్ని సహచర ఉద్యోగులు ఎనెల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా మరోసారి గుండెపోటుకు గురై మృతి చెందారు. కాగా అక్బర్‌అలీ స్వస్థలం తిరుపతి. ఆయన ఏడాది క్రితం ఏడీగా నెల్లూరుకు వచ్చారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నెల్లూరు (టౌన్): నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్ లీక్‌పై వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గువారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేయాలని నగరంలోని వీఆర్సీ సెంటరులో విద్యార్థి సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. నీట్‌లో అత్యధిక ర్యాంకులు దేశంలోని ఒకే ప్రాంత విద్యార్థులకు రావడంతో అందరిలో అనుమానాలు తలెత్తాయన్నారు. నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించి వైద్య విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. దేశ వ్యాప్తంగా నీట్‌పై ఆందోళనలు జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించపోవడం శోచనీయమన్నారు. నీట్ పరీక్ష రద్దుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మస్తాన్‌షరీఫ్, హర్ష, సునీల్, చైతన్య, శివం వర్మ, షారూఖ్‌ఖాన్, అక్షయ్, ఆకాశ్, శరణ్, సాయి, ప్రతాప్, అల్తాఫ్, అబ్దుల్, చరణ్, విష్ణు, ఆశీర్ పాల్గొన్నారు.

వివేకానందుని ప్రసంగాలు స్ఫూర్తిదాయకం

నెల్లూరు(బారకాసు): వివేకానందుని ప్రసంగాలు యుగయుగాలకు స్ఫూర్తిదాయకమని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ములుముడి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం మిడతల పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిడతల మాట్లాడుతూ వివేకానందుడు కర్మయోగి అని, భారతీయ జీవన విధానాన్ని ఒక్క మాటలో యావత్ ప్రపంచానికి చాటిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. 1893లో చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్న వివేకానందుడు ప్రపంచంలోని నా సోదరి సోదరులారా అని మాట్లాడడంతో యావత్ ప్రపంచ ప్రతినిధులు ఆయన ప్రసంగానికి ముగ్ధులు అయిపోయారని గుర్తుచేశారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన కారణజన్ముడు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులునాయుడు, ముక్కు రాధాకృష్ణ, ఆదినారాయణ, పెండ్యాల భాస్కర్, వెంకటేష్, శ్రీను, మెంటా రామమోహన్, నవీన్, ముని, సురేష్, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవ'సాయం' ఏదీ?

- కొత్త ప్రభుత్వంలో అందని పెట్టుబడి సాయం
- ఇంకా ప్రకటన చేయని రాష్ట్ర సర్కారు
- రైతులకు తప్పని ఎదురు చూపులు
- ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు జమ
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు వైఎస్సార్ రైతు భరోసా



ఎడగారు సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కోవూరు: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఎడగారు సాగును ప్రారంభించారు. ఇప్పటికే కోవూరు సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 15,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయాన్ని విడుదల చేసింది. గత నెల 18న రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున నగదు జమ చేసింది. ఈ మొత్తం ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఉపయోగపడింది అయితే రాష్ట్ర ప్రభుత్వ సాయం ఇంకా విడుదల కాకపోవడంతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతులకు అందజేసింది. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయాన్ని ఐదేళ్ల పాటు అందించింది.

కౌలు రైతులకూ భరోసా

ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు అటవీ, దేవాదాయ భూములను సాగు చేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది.

అన్నదాతల ఎదురుచూపు

కోవూరు సబ్‌డివిజన్ పరిధిలోని కోవూరు మండలంలో 2,982, కొడవలూరులో 4,011 విడవలూరులో 4,244, బుచ్చిరెడ్డిపాళెంలో 3,752 మంది అన్నదాతలు ఉన్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఎడగారు సాగు పనులను ముమ్మరం చేశారు. దుక్కులు దున్నడం, విత్తనాల కొనుగోలు, నారుమడుల తయారీ, నాట్లు వేసేందుకు, ఎరువులకు పెట్టుబడి సాయం అవసరం. గత ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో తోడ్పడింది. ఏటా పీఎం కిసాన్ తొలివిడత సాయం రూ.2వేలు నగదు విడుదలతో పాటే వైఎస్సార్ రైతు భరోసా సాయం రూ.3,500ను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా జమచేసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సాయం రూ.2 వేలు మాత్రమే అందడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ కొలువుదీరారు. మంత్రులతో తొలి క్యాబినెట్ భేటీ కూడా ముగిసింది. అయినా రైతుల పెట్టుబడి సాయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం



టీపీగూడూరు: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

తోటపల్లిగూడూరు: అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకమని మండల పరిషత్ సూపరింటెండెంట్ కౌశలమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరు సీతారామరాజు జయంతిని గురువారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సూపరింటెండెంట్ కౌశలమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య సమరంలో కీలకపాత్ర పోషించారన్నారు. చిన్న వయస్సులోనే అల్లూరి తన ధైర్యసాహసాలతో బ్రిటీష్ పాలకులను గడగడలాడించాలన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన అల్లూరి అడుగుజాడల్లో నేటి యువత నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వరలక్ష్మి, రఘునాథరెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో వీఎస్‌యూ అభివృద్ధికి కృషి

- ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత



మాట్లాడుతున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం: అందరి సహకారంతో విక్రమసింహపురి వర్సిటీ(వీఎస్‌యూ) అభివృద్ధికి కృషి చేస్తామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కే సునీత పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో అధ్యాపకులతో కలిసి గురువారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఎస్‌యూ 2008లో నెల్లూరులో అద్దె భవనాల్లో ప్రారంభమైన వర్సిటీ అంచలంచెలుగా అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధనను అందించడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ న్యాక్ ఏ గ్రేడ్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిందన్నారు. అయితే గత కొన్నినెలలుగా కొందరు వీఎస్‌యూపై దుష్ప్రచారం సాగిస్తూ వర్సిటీ కీర్తిని మసకబార్చేందుకు యత్నిస్తున్నారని, దానిని తాము ఖండిస్తున్నామన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా అసత్యపు ప్రచారాలను సోషల్ మీడియాలో పెట్టడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో వీఎస్‌యూను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, డిప్యూటీ రిజిస్ట్రార్ సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ్‌కుమార్, పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కమిషనర్ వెంకట రమణబాబు కౌన్సిల్ అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. పట్టణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలకు సంబంధించిన అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రధాన సమస్యలను కౌన్సిల్ సభ్యులు విన్నవించగా పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. కాగా సమావేశానికి పలువురు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. చైర్‌పర్సన్ సుప్రజ మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం నుంచి తొలిసారి మహిళా ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా కౌన్సిల్ సభ్యులు తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణాభివద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిటీ ప్లానర్‌పై చర్యలు తీసుకోవాలి



టౌన్‌ప్లానింగ్ విభాగం బయట ఉన్న కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా టౌన్‌ప్లానింగ్ విభాగం సిటీప్లానర్ అవినీతికి పాల్పడుతున్నారని సీపీఐ నాయకులు లీలామోహన్, నరసింహారావు ఆరోపించారు. గురువారం వారు కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సిటీప్లానర్‌కు వినతిపత్రం అందజేయగా స్వీకరించలేదు. సమస్యను వినేందుకు కూడా నసేమిరా అన్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్ గది బయట ఉన్న కుర్చీకు వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ఇరిగేషన్ కాలువలు, డ్రైనేజీలను ఆక్రమించి పలువురు మూడు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను విడిపించాలని సిటీప్లానర్‌కు విన్నవించేందుకు రాగా స్పందించలేదన్నారు. దీనిని బట్టి చూస్తే కచ్చితంగా అక్రమ కట్టడాల విషయంలో సిటీప్లానర్ అవినీతికి పాల్పడుతున్నారనే అనుమానం కలుగుతోందని ఆరోపించారు. పొగతోటలో ఇరిగేషన్ కాలువను ఆక్రమించి మూడు అంతస్తుల భవన నిర్మాణం చేపడుతుండడంపై ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసిన చర్యలు మాత్రం శూన్యమన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగ ఉన్నతాధికారి దేవీకుమారి పనితీరుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. గతంలో కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓసీ లేకుండానే మార్ట్‌గేజ్ చేసినటువంటి సొమ్మును డ్రా చేశారనే విషయంలోనూ ఆ అధికారి పాత్ర కూడా ఉందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయన్నారు. ఇప్పటికే దీనిపై విజిలెన్స్ ఎంక్వైరీ జరుగుతూ ఉందన్నారు. నగరంలోని ప్రభుత్వ భూములు, కాలువలు ఆక్రమణలకు గురవుతున్నా స్పందించనటువంటి టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యా సామగ్రి పంపిణీ

పొదలకూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విద్యా సామగ్రిని పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ–2 శోభనాద్రి గురువారం తెలిపారు. విద్యార్థులందరూ హాజరై విద్యాసామగ్రిని తీసుకోవాలని సూచించారు.

నుడా వైస్‌చైర్మన్ ఫిర్యాదు

పొదలకూరు: పొదలకూరు పరిసర ప్రాంతాల్లో లేఅవుట్లు సక్రమంగా లేవని నుడా వైస్‌చైర్మన్ పొదలకూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన నుడా అనుమతి లేని లేఅవుట్లపై సమగ్ర విచారణ చేపట్టాల్సిందిగా కోరారు. న్యాయపరమైన సలహాలతో పాటు, ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

బెల్ట్‌షాపుపై సెబ్ అధికారుల దాడి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పెనుబల్లిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఈబీ అధికారులు గురువారం రాత్రి దాడులు చేశారు. బెల్టుషాపు నిర్వహిస్తున్న వెంకటశేషయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా పెనుబల్లి సర్పంచ్ పుడా పెంచలయ్యకు వెంకటశేషయ్య వరుసకు మామ అవుతాడు. దీంతో వెంకటశేషయ్యను విడిపించేందుకు సర్పంచ్ స్టేషన్‌కు చేరుకుని తీవ్రఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. మినగల్లులో ఇటీవల బెల్ట్‌షాపుల వ్యవహారం బయటపడింది. విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం అక్రమంగా విక్రయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండికొడుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని బార్ మాటున గ్రామాల్లో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గుండెపోటుతో ఈఆర్వో మృతి



సీహెచ్ దిలీప్ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సీహెచ్ దిలీప్(39) గురువారం వేకువన గుండెపోటుతో మృతి చెందారు. ఈయన కోవూరు విద్యుత్ శాఖలో ఈఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దిలీప్ మృతదేహాన్ని విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్, కోవూరు డీఈ రమేష్, ఏడీ శ్రీనివాస్, డీఈఈ శీనయ్య, పలువురు విద్యుత్ ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మర్యాదపూర్వకంగా...



జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామినిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.
–నెల్లూరు (లీగల్)

నేత్రపర్వం..రామలింగేశ్వరుని కల్యాణం



విడవలూరు: మండలంలోని రామతీర్థంలో కొలువైన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కామాక్షిదేవి, రామలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రామలింగేశ్వరునికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కామాక్షిదేవికి ఉభయకర్తలు కృష్ణారెడ్డి, పార్వతమ్మ కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు.

డెంగీ నివారణ చర్యలపై అవగాహన



డెంగీ నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న నాగరాజు

కొడవలూరు: డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా కొడవలూరు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు డెంగీ నివారణ చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీ సబ్‌యూనిట్ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఎడిస్ అనే పగటి వేళ కుట్టే దోమ వల్ల డెంగీ వ్యాధి వస్తుందని తెలిపారు. మంచి నీటి నిల్వల్లో ఎడిస్ దోమ ఉంటుందని తెలిపారు. గురుకులంలో మంచినీటితో పాటు మురుగు నిల్వలు ఎక్కడా లేకుండా చూసుకోవాలని సూచించారు. డెంగీ ప్రాణాంతకమైనందున ముందస్తు జాగ్రత్తల ద్వారానే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ పీ దేవసహాయం, సీహెచ్‌ఓ టీ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు



గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

మనుబోలు: బండేపల్లి రోడ్డు సమీపంలో నుంచి గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తు న్నారు. మనుబోలుకు చెందిన ఓ వ్యక్తి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రాత్రి వేళల్లో గ్రావెల్‌ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతను బాధ్యతగా భావించాలి

- ఎంహెచ్‌ఓ వెంకటరమణ



పరిసరాల శుభ్రతను పరిశీలిస్తున్న హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): పరిసరాల శుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావిస్తే ఆరోగ్యకర సమాజం సాధ్యమని కార్పొరేషన్ ఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని చిన్నబజార్ పండ్ల మార్కెట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దుకాణదారులతో మాట్లాడారు. ప్రతిఒక్క దుకాణం వద్ద చెత్తకుండీని ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఉపయోగించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మార్కెట్లోని వ్యర్థాలను చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు మాత్రమే అందించాలని, చెడిపోయిన పండ్లను వీధుల్లో పడేయడం వల్ల పశువులకు ఆవాసంగా మారే ప్రమాదం ఉందన్నారు. కార్పొరేషన్ పారిశుధ్య విభాగం కార్మికుల దైనందిన విధులకు తోడుగా పండ్ల మార్కెట్ వ్యాపారుల సంఘ సభ్యుల నుంచి ఎంపిక చేసిన కొంత మంది వ్యక్తులు స్వచ్ఛందంగా దుకాణాల పరిసరాలను ప్రతిరోజూ శుభ్రం చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామమని సంతోషం వ్యక్తం చేశారు. షిఫ్టుల వారీగా 24గంటల పాటు పరిసరాల శుభ్రతను అసోసియేషన్ నిర్దేశించిన వ్యక్తులు చేపట్టనున్నారని తెలిపారు. అదేవిధంగా ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, స్టోన్‌హౌస్‌పేట వ్యాపారుల అసోసియేషన్‌లతో సమావేశాలు నిర్వహించి నగర వ్యాప్తంగా స్వీయ పారిశుధ్య నిర్వహణ ప్రక్రియను అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని ఆయన వెల్లడించారు.

జల్‌జీవన్ మిషన్ పనులు భేష్



డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న సచిద్రకుమార్‌పట్నాయక్

నెల్లూరు(పొగతోట): జిల్లాలో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులు బాగున్నాయని జలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచిద్రకుమార్‌పట్నాయక్ కితాబునిచ్చారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలిగిరి, వింజమూరు మండలాల్లో చేపట్టిన చెక్‌డ్యామ్‌లు, పంటకుంటలు, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. పనులను బాగా చేపట్టడంపై అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసులు, ఏపీడీలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

కీరవాణి సంగీతం నవతరానికి స్ఫూర్తిదాయకం



నెల్లూరు(బృందావనం): తెలుగుజాతి కీర్తిని, తెలుగువారి సంగీత ప్రతిభను విశ్వవ్యాప్తం చేసిన సంగీత విద్వాంసుడు కీరవాణి అని బుల్లి తెర నటుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు పేర్కొన్నారు. మురళి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నగరంలోని నర్తకిసెంటర్‌లో కీరవాణి పుట్టిన రోజు వేడుకలను గురువారం నిర్వహించారు. తన సంగీత ప్రతిభతో ప్రపంచ సినీజగత్తులో ఖ్యాతి చెందిన ఆస్కార్ అవార్డును సాధించిన కీరవాణి సంగీత కళాకారులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు కేతా సుబ్బారావు, జయప్రకాష్, శీనయ్య, మస్తాన్, అబ్దుల్, సత్యం, మహేష్, రాము, మారి పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలకు లైసెన్స్‌లు తప్పనిసరి



ఆన్‌లైన్ ద్వారా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఎరువుల విక్రయాల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని జిల్లా సహకార అధికారి గుర్రప్ప తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయం నుంచి పీఏసీఎస్‌ల అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 58 పీఏసీఎస్‌లు మాత్రమే ఎరువుల విక్రయాలకు లైసెన్స్‌లు కలిగి ఉన్నాయని తెలిపారు. మిగిలిన 25 పీఏసీఎస్‌లు అత్యవసరంగా ఎరువుల లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 6న 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ప్రతి సహకార సంఘంలో ఘనంగా నిర్వహించాలన్నారు.